www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 26 నవంబర్ 2025

5

ఏలూరు

రాష్ట్రస్థాయి పోటీల్లో కమల ప్రతిభ

మండవల్లి : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో లోకుముడి విద్యార్థిని అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులగం వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని లోకుముడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు కూడా ముఖ్యమేనన్నారు. విద్యలు, ఆటల్లో రాణించిన ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చున్నారు. ఇటీవల మచిలీపట్నం నోబుల్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో లోకుముడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బెండ టార్సీ కమల పాల్గొంది. ఉమ్మడి కృష్ణా జిల్లా టీమ్‌లో ఆడి కబడ్డీ పోటీల్లో ఉత్తమమైన ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా 30 ఏళ్ల చరిత్రను తిరగరాసిందన్నారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి ఆడిన కమలను ప్రధానోపాధ్యాయులతో పాటు పిఇటి వేణుబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా అభినందించారు.

రోడ్లు వేయండి మహాప్రభో

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జెడ్‌పిటిసిలు గగ్గోలు

రోడ్లు దారుణంగా ఉన్నాయన్న ఎంఎల్‌ఎ బొలిశెట్టి

రాజకీయ ఆరోపణలతో రసాభాసగా సమావేశం

ఎజెండా అంశాలు చెప్పకుండా ముగించడంపై సభ్యుల ఆగ్రహం

సమావేశాన్ని జెడ్‌పి చైర్మన్ సక్రమంగా నడపించలేదని విమర్శలు

ఎజెండాలో తప్పులపై డీసెంట్ నోట్ ఇచ్చిన పోడూరు జెడ్‌పిటిసి

పెదవేగి మండలంలో బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులను నిలదీత

జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గోతులమయంగా మారి జనం నరకయాతన అనుభవిస్తున్నారు. భీమవరం దిరుసుమర్రు రోడ్డు, మత్స్యపురి - భీమవరం రోడ్డు, ఏలూరు - వంగాయగూడెం రోడ్డు, జంగారెడ్డిగూడెం - ఏలూరు రోడ్డు, వీరవాసరం - బ్రాహ్మణచెరువు రోడ్డు, చింతలపూడి మండలంలో శివాపురం - మల్లేశ్వరం రోడ్డు ఇలా జిల్లాలోని రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయంటూ జిల్లాలోని జెడ్‌పిటిసిలు గగ్గోలు పెట్టగా, రోడ్ల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందంటూ తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పెదవి విరిచారు. మంగళవారం జెడ్‌పి చైర్మన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఉదయం స్థాయి సంఘాలు సమావేశాలు జరగ్గా, మధ్యాహ్నం నుంచి సర్వసభ్య సమావేశం నడిచింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు బొలిశెట్టి శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, ఎంఎల్‌సి వంకా రవీంద్ర, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి ఇతర అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ, విద్య, ఆర్‌అండ్‌బి, ఆరోగ్య, ఎక్సైజ్‌శాఖలపై సమీక్షా సమావేశం జరిగింది. ఎంఎల్‌ఎలు, జెడ్‌పిటిసిలు మాట్లాడుతూ రబీలో యూరియా సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, డిసిఎంఎస్‌లో ఎరువులకు రవాణా ఛార్జీల పేరుతో రూ.వంద అదనంగా వసూలు చేయడం, మొంథా తుపానుతో దెబ్బతిన్న పంటలకు బీమాపై, ధాన్యం కొనుగోలు, సంచులపై, ప్రయివేటు పాఠశాలల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, రోడ్లు, జెడ్‌పిటిసిల విషయంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలు, మందులు నాణ్యతపై, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం, బెల్టుషాపులపై చర్చలు కొనసాగాయి. అందుకు సంబంధించిన సమాధానాలను అధికారులు వివరించారు. జెడ్‌పి చైర్మన్ పద్మశ్రీ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో కూటమి సర్కార్ రైతులకు మేలు చేస్తోందని, మూడు గంటల్లో సొమ్ములు జమవుతున్నాయని తెలిపారు. పదో తరగతి పిల్లలకు మెటీరియల్ బుక్ అందించామని తెలిపారు. రాష్ట్రంలో పది ఫలితాల్లో మొదటి స్థానం రావాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖపై మంచి చర్చలు జరిగాయన్నారు.

రాజకీయ విమర్శలతో రసాభాస

జిల్లా పరిషత్ సమావేశం తూతూమంత్రంగా అన్నట్లు తయారైన పరిస్థితి నెలకొంది. గతంలో ఉదయం ప్రారంభించి సాయంత్రం వరకూ కొనసాగించేవారు. ఎజెండా అంశాలపై విస్తృతంగా చర్చలు సాగేవి. ఇప్పుడు సాయంత్రం మూడు గంటలకు సమావేశం ప్రారంభించి రెండు గంటల్లో ముగించేస్తున్నారు. ఒకటి, రెండు అంశాలు తప్ప మిగిలిన వాటిపై చర్చలు లేకుండా పోతున్నాయి. మంగళవారం జరిగిన సమావేశంలో రాజకీయ అంశాలను తెరపైకి తెచ్చి ఎజెండా అంశాలపై సరైన చర్చలేకుండానే ముగించేసిన పరిస్థితి నెలకొంది. పాలకొల్లు జెడ్‌పిటిసి గోవిందరాజుల నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంటల బీమా ఉచితంగా ఉండేదని, ఇప్పుడు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ప్రశ్నించారు. ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు జోక్యం చేసుకుని గత ప్రభుత్వంలో రైతులకు ధాన్యం డబ్బులు కూడా ఇవ్వలేదని, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఎదురు దాడి చేయడంతో సమావేశం రసాభాసగా మారింది. ప్రజా సమస్యలపై మాట్లాడాలని, ప్రభుత్వ విధానాలపై మాట్లాడితే గత ప్రభుత్వం గురించి మాట్లాడాల్సి వస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్‌పిటిసిల ప్రోటోకాల్ పాటించకపోవడంపై సమావేశంలో పెద్దఎత్తున చర్చ సాగింది. ఎంఎల్‌ఎ బొలిశెట్టికి, జెడ్‌పిటిసిలకు మధ్య మాటల యుద్ధం కొనసాగింది. రోడ్లు, తాగునీరు, డ్రైయినేజీ వంటి అనేక సమస్యలు ఉన్నాయని, వాటి గురించి మాట్లాడాలంటూ ఎంఎల్‌ఎ తెలిపారు. జెడ్‌పిటిసిల వేతన బకాయిలపై కొంతసేపు చర్చ సాగింది. పెదవేగి జెడ్‌పిటిసి మాట్లాడుతూ తమ మండలంలో బెల్టు షాపులు లైసెన్స్ దుకాణాల మాదిరిగా నడుస్తున్నాయని తెలపగా, రాతపూర్వంగా ఇవ్వాలంటూ ఎక్సైజ్ అధికారులు అనడంతో సదరు సభ్యుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. కలెక్టర్ వెట్రిసెల్వి జోక్యం చేసుకుని ఆకస్మిక తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఎరువులకు సంబంధించి డిసిఎంఎస్‌లో రూ. వంద అదనంగా వసూలు చేయడంపై వ్యవసాయాధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంపై ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటు స్కూళ్లలో మరుగుదొడ్లు లేకపోవడం పిల్లలు నీరు తాగడం లేదని, సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం కౌన్సిలర్లు లేకపోవడం, డంపింగ్ యార్డ్‌ల ఏర్పాటు వంటి అంశాలను ఎంఎల్‌సి వంకా రవీంద్ర లేవనెత్తారు. జెడ్‌పి పనులకు సంబంధించి రద్దు చేయడంపై వాదోపవాదాలు జరిగాయి. జెడ్‌పి నిధులు గ్రామీణ ప్రాంతాలకు అత్యధికంగా కేటాయించాలంటూ ఎంఎల్‌ఎ మద్దిపాటి తెలిపారు. సమావేశం క్రమపద్ధతిలో నడపడంలో చైర్మన్ విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తాయి. స్టేజిపైకి ఎంఎల్‌ఎల గన్‌మెన్‌తో సహా అంతా గుంపుగా ఉండడం నుంచి, సభ్యులను కంట్రోల్ చేయడంలోనూ సరైన విధానం లేకుండా పోయింది. దీంతో సమావేశం ఆద్యంతం గందరగోళం మధ్యే నడిచింది.

డీసెంట్ ఇచ్చిన పోడూరు జెడ్‌పిటిసి

ఎజెండా అంశాల్లో తీవ్రంగా తప్పులు ఉన్నాయంటూ పోడూరు జెడ్‌పిటిసి, ఫ్లోర్ లీడర్ గుంటూరు పెద్దిరాజు 13 అంశాలపై సమావేశం ఆరంభంలోనే డీసెంట్ నోట్ ఇచ్చారు. ఎజెండాలో అన్ని అబద్ధాలు పేర్కొన్నారని, నిధులకు సంబంధించి వివరాలు లేకుండా గంపగుత్తగా పేర్కొన్నారని ఆయన తెలిపారు. ఎజెండా అంశాలు చెప్పకుండా సమావేశం ఏవిధంగా ముగించేస్తారంటూ జెడ్‌పి సిఇఒపై పోడూరు జెడ్‌పిటిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి మీరు సమాధానం చెప్పాలంటూ పేర్కొన్నారు. డీసెంట్ నోట్‌కు వివరణ రూపంలో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

పోలవరం జిల్లా ఏర్పాటు..!

జిల్లా కేంద్రంగా రంపచోడవరం

పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాలు కలిపేస్తారా.. ముంపు మండలాల వరకేనా?

కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాల ప్రజల్లో చర్చ

కైకలూరు, నూజివీడు నియోకవర్గాలపై స్పష్టత కరువు

నాలుగు నియోజకవర్గాలతో ఏలూరు జిల్లా మిగలనుందా?

డ్రాఫ్ నోటిఫికేషన్ వచ్చాకే ఇతర మార్పులపై స్పష్టత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రక్రియలో భాగంగా ఏజెన్సీలోని ముంపు మండలాలను కలుపుతూ నూతనంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టత ఇచ్చింది. జిల్లా కేంద్రంగా రంపచోడవరం ఉంటుందని తెలిపింది. దీంతో పోలవరం నియోజవకవర్గంలో ఉన్న ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాలనే కలుపుతారా జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాలను కలుపుతారా అన్నదానిపై స్పష్టత లేకుండాపోయింది. పోలవరం ఏర్పాటు ప్రకటనతో కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాల ప్రజల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. గడిచిన రెండు రోజులుగా కొత్త జిల్లాల ఏర్పాటు, పలు జిల్లాల్లో మార్పులు చేర్పులపై మంత్రుల కమిటీతో సిఎం చర్చలు జరిగాయి. మంగళవారం జరిగిన చర్చల్లో పోలవరం జిల్లా ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది. 2024 ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతాన్ని కలుపుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామంటూ సిఎం చంద్రబాబు ప్రకటించారు. మ్యానిఫెస్టోలో సైతం పెట్టారు. గడిచిన ఏడాదిన్నర పాలనలో పోలవరం జిల్లా ఏర్పాటు ప్రస్తావన ఎక్కడా లేకపోవడంతో హామీని బుట్టదాఖలు చేసినట్లేనని అంతా భావించారు. రంపచోడవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంపై ఏజెన్సీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అదే క్రమంలో పోలవరం నియోజకవర్గంలో ఉన్న పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం, కొయ్యలగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు మొత్తం ఏడు మండలాలను కొత్తగా ఏర్పాటు కానున్న పోలవరం జిల్లాలో కలిపేస్తారా, లేక కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాలను వేరు చేస్తారా, అన్నదానిపై మాత్రం స్పష్టత లేకుండా పోయింది. దీంతో కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాల ప్రజల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. నూతనంగా ఏర్పాటయ్యే పోలవరం జిల్లాలో కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాలను కలిపితే తాము తీవ్ర ఇబ్బంది పడతామన్న అభిప్రాయం అక్కడి ప్రజల్లో వ్యక్తమవుతోంది. దీంతో పోలవరం జిల్లా ఏవిధంగా ఉంటుందన్న సస్పెన్స్ కొనసాగుతోంది. అదే క్రమంలో నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలన్న ప్రతిపాదనలపై సమావేశంలో ఏ నిర్ణయం తీసుకున్నారో సరైన స్పష్టత లేకుండా పోయింది. ఈ నియోజకవర్గాలను ప్రజల కోరిక మేరకు ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో కలుపుతారా.. లేదా అన్నదానిపై స్పష్టత లేకుండా పోయింది. ఉంగుటూరు నియోజవర్గంలో ఉన్న గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలుపుతారో లేదో కూడా తెలియని అయోమయ పరిస్థితి కొనసాగుతోంది.

ఏలూరు జిల్లాలో నాలుగు నియోజకవర్గాలేనా?

ప్రస్తుతం ఏడు నియోజకవర్గాలతో ఏలూరు జిల్లా ఉంది. జిల్లాల మార్పులతో నూజివీడు నియోజకవర్గం ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరు కృష్ణజిల్లాలో, నూతనంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తే ఏలూరు జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు మాత్రమే మిగలనున్నాయి. అతిచిన్న జిల్లాగా ఏలూరు మిగిలిపోనుంది. ఆదాయ వనరులు సైతం పెద్దగా లేని జిల్లాగా ఉండిపోనుంది. దీంతో ఏలూరు జిల్లా భవిష్యత్తు ఏంటన్న ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. అధికార పార్టీకి సంబంధించిన ఎంఎల్‌ఎలు మాత్రం నోరువిప్పడం లేదు. వేరే నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో కలుపుతారా.. లేక ఏవిధంగా ఏలూరు జిల్లా ఉండనుందన్న చర్చ జిల్లా ప్రజల్లో విస్తృతంగా కొనసాగుతోంది. జిల్లాలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వస్తే తప్ప స్పష్టత వచ్చే పరిస్థితి కానరావడం లేదు. ప్రభుత్వం జిల్లాలోని ప్రజాప్రతినిధులతో ఏమైనా చర్చలు జరిపిందా లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

గొల్లగూడెంలో సిఎం పర్యటనకు ఏర్పాట్లు

గొల్లగూడెం - నల్లమాడు దారిలో సూర్య స్కూల్ సమీపంలో హెలీప్యాడ్

చేబ్రోలు - దేవులపల్లి ఆర్‌అండ్ రోడ్డు మార్గంలో గొల్లగూడెం వద్ద బహిరంగ సభ

సూర్యస్కూల్ సమీపంలో పార్టీ కేడర్‌తో సమావేశం

ప్రజాశక్తి - ఉంగుటూరు

డిసెంబరు ఒకటిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఏలూరు జిల్లా పర్యటన దాదాపు ఖరారు అయినట్టే. అయితే అధికారిక షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉంగుటూరు మండలంలో కైకరం, నారాయణపురం, ఉంగుటూరు, చేబ్రోలు, గొల్లగూడెంలో వేర్వేరు ప్రాంతాలను మంగళవారం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం జల్లెడ పట్టారు. సిఎంఒ నుంచి వచ్చిన ప్రత్యేక యంత్రాంగంతో పాటు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ విజయరావు, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, భీమడోలు, నిడమర్రు సిఐలు విల్సన్, రజనీకుమార్ సిఎం పర్యటన, సభా వేదిక, కార్యకర్తలతో సమావేశం, ఇంటింటికీ వెళ్లి ఇద్దరికి పింఛన్ల పంపిణీలో సిఎం పాల్గొనేలా కార్యక్రమాన్ని రూపొందించనున్నారు. చేబ్రోలు - దేవులపల్లి ఆర్‌అండ్‌బి రహదారి గొల్లగూడెం వద్ద రామచంద్రపురం అడ్డరోడ్డు సమీపంలో పొలాల్లో బహిరంగ సభ వేదిక, దానికి ఎదురుగానే వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్వేషణ ఖరారైంది.

ఏర్పాట్ల గురించి మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ, కలెక్టర్

గొల్లగూడెం - నల్లమాడు దారిలో సూర్య స్కూల్ ఆవరణలో హెలీప్యాడ్, దానికి సమీపంలోనే కూటమి నాయకులు, కార్యకర్తలతో సిఎం సమావేశం కోసం వేదిక ఏర్పాటు చేయనున్నారు. సిఎం చేతుల మీదుగా పెన్షన్లు ఇచ్చేవారి జాబితా ప్రకారంలో, గోపీనాథపట్నం, చేబ్రోలులో వివిధ వ్యాధులతో బాధపడుతున్న గుడ్ల నాగలక్ష్మి (డైలాసిస్ పేషెంట్), కేదారి అరుణకుమారి (హీమోఫిలియా - ఒంటి మీద తెగితే రక్త ఆగకుండా కారిపోయే వ్యాధి)ను కలెక్టర్, ఎంఎల్‌ఎ ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. వారి ఇద్దరి ఇళ్లకు ముఖ్యమంత్రి వెళ్లి వాళ్లతో మమేకమై పింఛను సొమ్ములు ఇవ్వనున్నారు. ఆ మేరకు చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత యంత్రాంగానికి ఆదేశాలిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రైతన్న మీకోసం కార్యక్రమం గొల్లగూడెంలోనే నిర్వహించేటప్పుడే పార్టీ పరిస్థితులపై నేతలతో సిఎం సమావేశం కానున్నారు. టిడిపి మండల అధ్యక్షుడు వేములపల్లి సుధీర్, ఎంపిడిఒ రాజ్‌మనోజ్, తహశీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, నాయకుడు కడియా రవిశంకర్, చేబ్రోలు, గొల్లగూడెం సర్పంచులు రాంధే లక్ష్మీసునీత, కరపా వెంకట శ్రీనివాసరావు, రామకృష్ణ, అక్కిన శేషు పాల్గొన్నారు.

కొల్లేరు రైతులపై ఉక్కుపాదం..!

- నిడమర్రు మండలంలోని తోకలపల్లి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి
- పొలాల్లో పనులు చేసేందుకు వెళ్లకుండా అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు
- గ్రామస్తులు, అధికారుల మధ్య తోపులాటలు
- నేడు డిఆర్‌ఎసి సమావేశంలో స్పష్టత ఇవ్వాలంటున్న కొల్లేరు రైతులు

ప్రజాశక్తి - నిడమర్రు

కొల్లేరు రైతులపై అటవీశాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. కొల్లేరును ఆనుకుని ఉన్న వరి పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్న పరిస్థితి నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. దాళ్వా సీజన్ దగ్గర పడడంతో తోకలపల్లి గ్రామానికి చెందిన రైతులు కొల్లేరు పొలాల్లో పనులు చేసేందుకు బయలుదేరారు. అటవీశాఖ అధికారులు వీరిని అడ్డుకోవడంతో తోపులాటలు జరిగాయి. దీంతో అటవీశాఖ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారంతా అక్కడకు చేరుకున్నారు. గ్రామస్తులను పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. తమకు కొల్లేరు పొలాలే ఆధారమని, పరిసాగు చేయకుండా అడ్డుకోవడం తగదంటూ గ్రామస్తులు వాగ్వివాదానికి దిగారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. జనం రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు జోక్యం చేసుకుని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానంటూ చెప్పడంతో గ్రామస్తులు వెనక్కి తగ్గినట్లు తెలిసింది.

పొలాల్లోకి వెళ్లనివ్వాలంటూ కూర్చున్న గ్రామస్తులు

బుధవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్‌సి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కొల్లేరు రైతులకు సంబంధించిన సాగుపై స్పష్టత ఇస్తారా లేదో చూడాల్సి ఉంది. ఉంగుటూరు ఎంఎల్‌ఎ కొల్లేరు రైతుల సమస్యను సమావేశంలో లేవనెత్తాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. రబీ సాగు దగ్గర పడడంతో ఇంకా ఆలస్యం చేయడం ఏమాత్రమూ తగదని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం కొల్లేరు రైతులను ఇబ్బంది పెట్టడం ఏమాత్రం సమంజసం కాదని కొల్లేరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అక్రమ సస్పెన్షన్లకు వ్యతిరేకంగా ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఏలూరు డిపో వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా జెఎసి నాయకులు వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ అవినీతి జరిగితే అసలు దోషులను శిక్షించకుండా డబ్బులు కట్టించుకుని వారిని రక్షించడం నేరమన్నారు. ఈ అవినీతిలో సంబంధం లేని అమాయకులైన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అక్రమ సస్పెన్షన్లు రద్దుచేసి తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవడంతో పాటు అసలైన దోషులడే స్థాయిలో ఉన్నా సరే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య నిరసన తెలియజేయగా సిహెచ్ఎస్ఆర్‌కెవి.ప్రసాద్, ఎస్‌విఆర్ బాబు, పి.జయరాం, టిఎస్.నారాయణ, కె.బాబూరావు, బివి.అంజలి కుమారి, ఎన్.రోజా, ఎం.నాగమణి, పి.నీలిమ, మూర్తి మంగళవారం దీక్ష శిబిరంలో కూర్చున్నారు.ఈ సందర్భంగా మంగళవారం ఆర్‌టిసి జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడును కార్మిక సంఘాల నాయకులు ఆయన కార్యాలయంలో కలిసి అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని, అసలైన దోషులను శిక్షించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

జంగారెడ్డిగూడెం : సస్పెండ్ చేసిన నలుగురిని విధుల్లోకి తీసుకోవాలని ఆర్‌టిసి డిపో జెసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాండురంగారావు మాట్లాడుతూ కింది స్థాయి కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. 80 లక్షల రూపాయల కుంభ కోణం వ్యవహారంలో అసలు తప్పు చేసిన అధికారులకు ఒక న్యాయం, కార్మికులకు వేరొక న్యాయం జరుగుతోందన్నారు. సస్పెండ్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు మండల కన్వీనర్ పి.సూర్యారావు, ఎస్‌డబ్ల్యూయు నాయకులు జిఎస్.నారాయణ, నాయకులు వి.గోపి పాల్గొన్నారు.

దీక్షలు చేస్తున్న నేతలు

నూజివీడు టౌన్ : పట్టణ పరిధిలోని ఆర్‌టిసి గ్యారేజ్ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. యూనియన్ కార్మిక నేత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌టిసిలో అధికారులు చేసిన అవినీతికి కార్మికులను బలి చేస్తూ అన్యాయంగా సస్పెండ్ చేయడం దారుణమన్నారు. అవినీతిపై సమగ్ర విచారణ నిర్వహించి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు మండల కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్.కొండలరావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను, 28 రకాల సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులుగా ప్రవేశపెట్టిన నోటీఫై రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తూ కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు. పని గంటలు ఎనిమిది గంటల నుంచి పది గంటలకు పెంచుతూ కార్మికులను బానిసలుగా చేస్తున్నారన్నారు. కార్మికులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ విరమించుకోవాలని, లేకపోతే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో

జీలుగుమిల్లిలో...

రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, భవన నిర్మాణ కార్మికులు ఎస్‌కె.మహబూబ్, పోలుకొండ నాగబాబు, కాసుల శ్రీనివాసరావు, మహిళా సంఘం నాయకులు దాసరి వెంకటలక్ష్మి, రమణ, సీత, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మడివి దుర్గారావు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్ష, కార్యదర్శులు బొగారి వెంకటేశ్వర్లు, సువ్వేటి లత, పిట్టా ముత్తమ్మ, నాగమణి, లక్ష్మి, మాస లక్ష్మి, నర్సమ్మ, సుజాత, సిపిఎం మండల కమిటీ సభ్యులు కొత్త వెంకటేశ్వర్లు, గుమ్మల వెంకటనర్సయ్య, ఎస్‌కె బాబులం పాల్గొన్నారు.

వేలేరుపాడులో...

సిపిఎం నేత దుర్యోదన మృతి తీరని లోటు

నివాళులర్పించిన నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం నేత, కార్మిక నాయకులు దువ్వాడ దుర్యోదన (70) సోమవారం రాత్రి ఏలూరులోని ఆయన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. దుర్యోదన జూట్ మిల్లు కార్మిక నాయకుడిగా సిపిఎం ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారు. సోమవారం ఉదయం ఆర్‌టిసి ఉద్యోగుల రిలే నిరాహార దీక్షల్లో సంఘీభావంగా పాల్గొన్నారు. రాత్రికి అకస్మాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమవారం రాత్రి దుర్యోదనకు ప్రభుత్వ ఆసుపత్రిలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి జోహార్లు అర్పించారు. మంగళవారం ఉదయం అయన నివాసం వద్ద దుర్యోదన భౌతికకాయంపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డివివిడి.ప్రసాద్ సిపిఎం పతాకాన్ని కప్పగా, సిపిఎం నగర కార్యదర్శి పంపన రవి కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా

కొనసాగిన మొక్కజొన్న రైతుల రిలే దీక్షలు

ప్రజాశక్తి – ద్వారకాతిరుమల

మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ నుంచి డబ్బులు వెంటనే ఇప్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పంగిడిగూడెం శివారు హనుమాన్‌గూడెంలో బాధిత మొక్కజొన్న రైతులు చేపట్టిరన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు తమకు న్యాయం చేయాలని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మోసపోయిన మొక్కజొన్న రైతులు మాట్లాడుతూ సీడ్ ఆర్గనైజర్ చేతిలో మోసపోయామని, తమకు న్యాయం చేయాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం, సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతులు వీరవల్లి శివ నాగరాజు, వీరవల్లి మోహనరావు, వీరవల్లి వీర వెంకట్రావు, గుర్రం పాపారావు, వీరవల్లి నాగేంద్రరావు, వీరవల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి – ముదినేపల్లి

జిల్లాల ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రారంభం కానున్న షష్టి కల్యాణోత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల పలు ఆలయాల్లో తొక్కిసలాట జరిగిన నేపథ్యంలో ఈ ఆలయంలో జరిగే షష్టి ఉత్సవాలకు యాత్రికులు వేలాదిగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌పి ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు, డ్రోన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సింగరాయపాలెం సెంటర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆలయం వద్ద క్యూ లైన్ల నిర్మాణం, దర్శనం కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. షష్టి ఉత్సవాల నిర్వహణకు డిప్యుటేషన్‌పై వివిధ ఆలయాలకు చెందిన 40 మంది అధికారులు, సిబ్బందిని దేవదాయశాఖ కమిషనర్ నియమించారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు.

క్లీన్ అండ్ గ్రీన్‌పై అవగాహన

ప్రజాశక్తి – ముదినేపల్లి

గ్రామాల శుభ్రం కోసం అందరూ కలిసికట్టుగా పని చేశామని ఎంపిడిఒ వై.రామకృష్ణ అన్నారు. థీమ్–5 క్లీన్ అండ్ గ్రీన్‌లో కార్యక్రమంలో మంగళవారం ముదినేపల్లి మండల పరిషత్ సమావేశపు హాలులో మండలంలోని డ్వాక్రా మహిళలకు పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.అశోక్, ఎఒ ఎం.రమణారావు, పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

'కష్టపడినవారికి టిడిపిలో సముచిత స్థానం'

ప్రజాశక్తి – కామవరపుకోట

మండలంలో పార్టీ కార్యకర్తల కష్టంతోనే తనకు వరుసగా రెండోసారి పదవి దక్కిందని, వారికే నా జీవితం అంకితమని టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ అన్నారు. వరుసగా రెండోసారి మండలాధ్యక్షులుగా ఎంపికైన కిలారుకు మండలంలోని పలు గ్రామాల కార్యకర్తలు, పార్టీ అభిమానులు, పార్టీ ప్రజాప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిలారు మాట్లాడుతూ టిడిపిలో కష్టపడితే సామాన్యులకు సైతం పదవులు వస్తాయని చెప్పారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

నూతన ఉపాధ్యాయులకు లంచ్ బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి – ముదినేపల్లి

ఎస్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నూతన ఉపాధ్యాయులకు లంచ్ బాక్సులు సిఎల్ పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మెగా డిఎస్‌సి–2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు ముదినేపల్లి మండల శాఖ తరపున బ్యాగులు పంపిణీ చేశారు. మండలంలోని ఉపాధ్యాయులందరికీ సిఎల్ పుస్తకాతు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు గణేష్ బాబు, ప్రధాన కార్యదర్శి నాగరాజ కుమార్, గౌరవ అధ్యక్షులు నాగ కిరణ్, శామ్యూల్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అమరవరపు అశోక్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి – వేలేరుపాడు రూరల్

తనను గుర్తించి మళ్లీ టిడిపి మండలాధ్యక్షునిగా ఎన్నిక చేసినందుకు టిడిపి జాతీయ అధ్యక్షులు సిఎం చంద్రబాబు నాయుడుకు, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అమరవరపు అశోక్ అన్నారు. వేలేరుపాడు టిడిపి మండలాధ్యక్షునిగా అమరవరపు అశోక్‌ను ఎన్నుకున్నందున టిడిపి మండల కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తల హర్షధ్వానాల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండలాధ్యక్షులుగా ఎన్నుకున్న అమరవరపు అశోక్‌కు టిడిపి నాయకులు కార్యకర్తలు, మండల ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమేళ్ల సుధాకర్, గొంది నాగేశ్వరరావు, కోటిపల్లి ముత్యాలరావు, కరుటూరి రాధాకృష్ణ, పసుపులేటి లక్ష్మయ్య, కుక్కునూరు సత్తిబాబు, చాపర్ల శ్రీనివాస్, అమరవరపు వెంకన్న, జనసేన నాయకులు మేచినేని సంజయ్ పాల్గొన్నారు.

అశోక్‌ను అభినందిస్తున్న కార్యకర్తలు

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

నూజివీడు టౌన్ : పట్టణంలోని జెడ్‌పి బాలికల హై స్కూల్ ఆవరణలో టీచ్ టూల్ అబ్జర్వేషన్ రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంఇఒ దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ గత కాలంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించాలని, సాల్ట్ ప్రోగ్రాంలో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాస్టర్ ట్రైనింగ్ దారపురెడ్డి భాస్కరరావు, పి.వరలక్ష్మి మాట్లాడుతూ గత అనుభవాల్లో వైఫల్యాలను అధిగమించి, అడుగడుగునా విజయ పరంపర కొనసాగేలా ఉపాధ్యాయులంతా ఐకమత్యంతో కృషి చేయాలన్నారు.

నేరాలు – ఘోరాలు

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

మండలంలోని వేగవరం గ్రామ శివారులో రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టి.నర్సాపురం మండలం అప్పలరాజుగూడెం గ్రామానికి చెందిన ముప్ప సాంబశివరావు, కలపాల రాజు జంగారెడ్డిగూడెంలోని పొగాకు వేలం కేంద్రం నుంచి బయలుదేరి అప్పలరాజుగూడెం బైక్‌పై బయలుదేరారు. వేగవరం గ్రామానికి చెందిన రామాయణం బ్రహ్మం బిసి కాలనీ సమీపంలో పొలం వెళ్లే పొంతలో నుంచి హైవే ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో తీవ్ర సాంబశివరావు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కలపాల రాజు, రామాయణం బ్రహ్మానికి గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురిపై కేసు

కామవరపుకోట : ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి, సిబ్బంది చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కామవరపుకోట గ్రామంలో మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో చిట్టిబొమ్మ వెంకట్రావు వద్ద లీటర్ నాటు సారాను స్వాధీనం పరచుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. టి.నరసాపురం మండలం బంధంచర్ల గ్రామానికి చెందిన దానం చంటికి చెందిన 50 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని అతనిపై పరారీ కేసు నమోదు చేశారు. మండలంలోని తిమ్మిరెడ్డిపల్లిలో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించగా తిమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొనకల్లా చెన్నారావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి – పోలవరం

వినతి అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం బృందం జానవాణి ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. మంగళవారం పోలవరం పంచాయతీ –1 కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జనవాణి కార్యక్రమంలో పాల్గొన్న పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు సిపిఎం పోలవరం మండల కమిటీ బృందం వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎకు సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకట్రావు, తామ ముత్యాలమ్మ, మండల కమిటీ సభ్యులు తామ బాలరాజు, మడివి చలపతిరావు, సముద్రాల సాయికృష్ణ, తామ బాలకృష్ణ, రాజులు సమస్యలను వివరించారు. పోలవరం మండల పరిధిలో గ్రామస్తులు ఎదుర్కొంటున్న రేపల్లేవాడ గ్రామం నుంచి వింజరం మీదుగా పోలవరం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని తెలిపారు. మండలంలోని కొమ్ముగూడెం, వింజరం, వెంకటరెడ్డిగూడెం, కోయనాగం పాలెం గ్రామాల్లో శ్మశానవాటికకు స్థలాలు లేక చనిపోయిన వారి అంతక్రియలకు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వెంకటరెడ్డిగూడెం గ్రామంలో ఏప్రిల్ నెలలో వచ్చిన తుపాన్ కారణంగా అంగన్వాడీ సెంటర్ పై కప్పు రేకులు ఎగిరి పోయాయాని, సెంటర్ ప్రస్తుతం అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారని, తక్షణమే సెంటర్ పై కప్పు నిర్మాణం చేపట్టాలని కోరారు. కొమ్ముగూడెం, వింజరం రోడ్డు పక్కన ఉన్న గోదావరి మంచినీటి ట్యాంక్ పెద్దది నిర్మించి మంచి నీరు సరఫరా చేయాలన్నారు. ఇటికలకోట, వింజరం, బోడిగూడెం గ్రామాల్లో కరెంట్ స్తంభాలు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, ఇతర గ్రామాల్లో డ్రెయినేజీ, సీసీ రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. వింజరం, చేగొండపల్లి గ్రామాల్లో రేషన్ డిపో బిల్డింగ్ శిథిలావస్థలో ఉందని, రేషన్ తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని, పక్కా భవనం నిర్మాణం చేపట్టాలన్నారు. వింజరం బస్టాండ్ నుంచి వెంకటరెడ్డిగూడెం గ్రామం వరకు రోడ్డు నిర్మాణం, ప్రధాన రహదారికి గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎంఎల్ఎను కోరారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

బాధితులకు బంగారం అప్పగింత

ప్రజాశక్తి – ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల యుటిఎఫ్ భవనంలో ఇటీవల వివాహం జరిగినప్పుడు వరుని బంధువులు బంగారు ఆభరణాలు గదిలో మరిచిపోయారు. భవనం వ్యవహారాలు చూసుకునే వీసం నాగేశ్వరరావు (యుటిఎఫ్ నాగు) వరుని బంధువులకు తెలిపాడు. యుటిఎఫ్ నూతన కౌన్సిల్ సమయంలో వరుని బంధువులకు యుటిఎఫ్ జిల్లా నాయకులు రవికుమార్, మస్తుఫాలీ, ఎంఇఒలు సత్యనారాయణ, వెంకటరావు చేతుల మీదుగా అందించారు. నాగేశ్వరరావు నిజాయితీని అందరు అభినందించారు.

విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి – టి.నర్సాపురం

మండలంలోని టి.నరసాపురం పంచాయతీ పరిధిలో ఉన్న అల్లూరి సీతారామరాజు నగర్ పేదలకు కరెంటు, తాగునీటి సౌకర్యం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుడెల్లి వెంకట్రావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా నివాసం ఉంటున్న అల్లూరి సీతారామరాజు నగర్ నివాసులకు కరెంటు, నీళ్ల సౌకర్యం కల్పించకపోవడం దారుణమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి గ్రామానికి కరెంటు, నీళ్ల ఇవ్వాలని, లేకపోతే రానున్న రోజుల్లో ఆందోళన చేస్తామని తెలిపారు.

2025 విత్తన చట్టం ముసాయిదాతో రైతులకు నష్టం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

బడా కార్పొరేట్ విత్తన కంపెనీల లాభాల కోసమే కేంద్ర ప్రభుత్వం 2025 విత్తన చట్టం ముసాయిదా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో కేంద్ర విత్తన చట్టం ముసాయిదాపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ముసాయిదాపై సూచనలు, అభ్యంతరాలు, సలహాలు డిసెంబర్ 11 వరకు పంపిచాలని కేంద్ర ప్రభుత్వం కోరిందని చెప్పారు. ప్రస్తుత ముసాయిదాలో సెక్షన్ 16 (3) ప్రకారం విత్తనాలను వాణిజ్యపరంగా రైతులకు విడుదల చేయటానికి దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ పరిశోధనలు చేయవచ్చని చెప్పిందన్నారు. కంపెనీలు నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేస్తే లైసెన్సులు రద్దు చేయటం, జైలు శిక్షలు విధించటం వంటి పెనాల్టీలు ముసాయిదాలో లేకపోవడంతో రైతులకు నష్టం జరుగుతుందని చెప్పారు. రైతుల ప్రయోజనాలకు అనుకూలంగా, దేశీయ టెక్నాలజీని వినియోగించి వాతావరణ జోన్లలో ప్రయోగాలు, పరిశోధనలు చేసి రైతులకు అందించే విధంగా విత్తన చట్టాన్ని రూపొం దించాలని డిమాండ్ చేశారు. విత్తన నాణ్యతపై, జెర్మినేషన్‌పై స్పష్టత ఉండాలన్నారు. రాష్ట్రాల స్థాయిలో నివుణులతో సమావేశాలు ఏర్పాటు చేసి విత్తన చట్ట ముసాయిదాను రూపొందించాలని కోరారు.

వార్షిక కార్యాచరణ ప్రణాళిక-2 తయారీపై శిక్షణ

ప్రజాశక్తి – భీమడోలు

స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు రామన్న ఆర్థిక సంవత్సరానికి వెలుగు రూపొందించనున్న 2026-27 కార్యాచరణ ప్రణాళిక సేవలను వినియోగించుకోవాలని వెలుగు భీమడోలు ఎపిఎం కె.రత్నకుమారి కోరారు. భీమడోలు మండల సమాఖ్య కార్యాలయంలో కల–గమ్యం(విజన్ బిల్డింగ్) అంశంపై రానున్న ఆర్థిక సంవత్సరానికి వార్షిక కార్యాచరణ ప్రణాళిక–2 తయారీపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమాల్ని ఎపిఎం ప్రారంభించారు. తొలుత ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గతంలో తయారు చేసిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక ప్రగతిపై పున:శ్చరణ చేశారు. అనంతరం ప్రస్తుత సంవత్సరం ఆ పేరున నిర్వహించనున్న కల– గమ్యం అంశం గురించి వివరించారు.కార్యక్రమంలో మండల పరిధిలోని సిసిలు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

యుటిఎఫ్ మండల నూతన కౌన్సిల్ ఎన్నిక

ద్వారకాతిరుమల : యుటిఎఫ్ ద్వారకాతిరుమల మండల కౌన్సిల్ అధ్యక్షుడిగా బి.జయరాజు, ప్రధాన కార్యదర్శిగా కట్టా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తఫా అలీ, ఆర్.రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రభత్వ అసంబద్ధ విధానాల వల్ల ప్రభుత్వ విద్యావ్యవస్థ బలహీనపడుతుందని, బోధనేతర కార్యక్రమాలు వల్ల పాఠశాలల్లో చదువులు కుంటుపడుతున్నాయని చెప్పారు. ఎంఇఒలు సత్యనారాయణ, వెంకటరావు మాట్లాడారు. అనంతరం జరిగిన నూతన కౌన్సిల్‌లో అధ్యక్షుడిగా బి.జయరాజు, ప్రధాన కార్యదర్శిగా కట్టా శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షునిగా ప్రభా కర రావు, సహాధ్యక్షునిగా పి.రాంబాబు, కోశాధికారిగా కె.చిన్న బాబు, మహిళా సహాధ్యక్షురాలిగా ఎస్.అప్పమ్మ, కార్యదర్శులుగా ఎం.జాన్సన్, ఎం.బాలసురేష్, ఆర్.అప్పయ్య, పి.సారధి, కె.బన్నీ, రవిత జ, కె.శ్రీనివాసరావు జ్ఞానేసు, శివశంకర్, నాగసతీష్, విజయలక్ష్మి ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి జి.దేవానం దరావు, పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ వ్యవ హరించారు. పూర్వపు, రిటైర్డ్ ఉపాధ్యాయులు బి.గంగరాజు, పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి – పోలవరం

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చెప్పారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సూచనల మేరకు మండలాల వారీగా నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమం తొలిసారిగా పోలవరం సచివాలయం–1 ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ప్రజల నుంచి వినతులను స్వీకరించి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా విని వాటిని వేగవంతంగా పరిష్కరించడమే జనవాణి లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, మండలాధ్యక్షులు గుణపర్తి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి – బుట్టాయగూడెం


మాట్లాడుతున్న ప్రముఖులు

బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ జి.కుసుమ అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిక్స్ లెక్చరర్ ఎం.ఇశ్రాయేలు రాజు సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మండల కేంద్రంలో అవగహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ వితరణ

నూజివీడు టౌన్ : నితిన్ వీరయ్య చౌదరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలోని బాయ్స్ హై స్కూల్‌లో ఉన్న మండల పరిషత్ ఫౌండేషన్ స్కూల్ పిల్లలకు ఆరోగ్యవంతంగా ఉండడానికి మంగళవారం వాటర్ బాటిల్స్, స్వీట్లు పంచిపెట్టారు. పిల్లలు చదువుకోలేక ఇబ్బంది పడితే వారికి ఎంతైనా తమ ఛారిటబుల్ ట్రస్ట్ నుంచి చదివిస్తామని ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి – ముసునూరు

గ్రామాభివృద్ధికి అధికారులతో పాటు నాయకులు కూడా సహకరించాలని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండల పరిధిలోని గుళ్లపూడి గ్రామ పంచాయతీ పరిధిలో హరిజనవాడలో డ్రెయినేజీ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మందలపు ధర్మరాజు, కొల్లి గంగారం, సొసైటీ అధ్యక్షులు కొల్లి కృష్ణయ్య, కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డ్రెయినేజీల శుభ్రం

ప్రజాశక్తి – మండవల్లి

దోమల వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పంచాయతీ ఆధ్వర్యంలో డ్రెయినేజీ క్లీనింగ్ పనులు చేపట్టామని సర్పంచి నాగదాసి థామస్ తెలిపారు. కానుకొల్లులో నిర్వహిస్తున్న డ్రెయినేజీ క్లీనింగ్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీ క్లీనింగ్ అనంతరం బ్లీచింగ్, సున్నం చల్లిస్తామని తెలిపారు.

కాంపిటీషన్ మెటీరియల్స్ పంపిణీ

ఉంగుటూరు : కాలేజీ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన కాంపిటీషన్స్ ఎగ్జామ్స్‌కు సంబంధించి మెటీరియల్స్‌ను మంగళవారం అందించారు. నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు వీటిని అందించామని ప్రిన్సిపల్ డాక్టర్ బివి.శ్రీనివాస్ తెలిపారు. వ్యాపారవేత్త వేగేశ్న రంగరాజు ఆర్థిక సాయంతో విద్యార్థులకు ఐడి కార్డులు తయారు చేయించి వాటిని పంపిణీ చేశారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

పోలవరం : కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ రైతాంగం పండించే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలని రైతులు రుణ మాఫీ చేయాలని, సామ్రాజ్యవాదులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విత్తన చట్టాన్ని ముసాయిదాను రద్దు చేయాలని కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు.

మహిళలు సమాన హక్కుల కోసం పోరాడాలి

ఏలూరు అర్బన్ : హింసను వ్యతిరేకిద్దాం – సమానత్వాన్ని సాధిద్దాం అంశంతో మంగళవారం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లాకమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్. రమణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అణిచివేతకు వ్యతిరేకంగా సమాన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు.

IN THE COURT OF 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE, ELURU (MOBILE COURT)
O.S.No.240/2025

Between:
State Bank of India rep by its, Cheif Manager, R.R.Peta, Eluru ...Plaintiff
And
Sri Lakshmi Agencies rep by its, Prop. T.Venkata Chaitanya Lakshmi
...Defendant

నోటీసు

పై కేసులో వాది అయిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఆర్ఆర్‌పేట, ఏలూరు బ్రాంచి వారు మీ వద్ద నుండి రావలసిన లోను బాకీ రాబట్టుకొనుటకై పైనంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు కేసులో కోర్టు వారు మీకు కోర్టు ద్వారా సమన్లు ఎన్నిపర్యాయములు జారీ చేయుచున్నను మీరు తీసికొనక కాలయాపన చేయుచున్నారు. దానిపై సదరు కోర్టు వారు మీకు అనగా "శ్రీలక్ష్మీ ఏజన్సీస్, రిప్రజెంటెడ్‌బై ప్రొప్రయిటర్ టి.వెంకట చైతన్య లక్ష్మీ, డోర్‌నెం.28–1–54, ఫ్లాట్ నెం.బి4, శ్రీసాయి దుర్గా రెసిడెన్సీ, 7వ రోడ్డు, శాంతినగర్, ఏలూరు కార్పొరేషన్‌కు పేపరు ద్వారా సమన్లు జారీ చేయమని ఆర్డరు వేసియున్నారు. కావున మీరు ది.12–12–2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టుకు హాజరు అయి సంజాయిషీని తెలియజేసుకోగలరు. లేనియెడల ఈ దావా మీ పరోక్షమందు విచారించబడును.

శ్రీమతి కర్లపాలెపు కళ్యాణి
అడ్వకేటు, ఏలూరు.

మహారాజశ్రీ ఏజెంట్ టు గవర్నమెంట్ కోర్టు : కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఒ.యస్. నెం.169/2024

బిట్వీన్ :
పెన్నాడ రామకృష్ణ (దత్తుడు), తండ్రి : లేటు నాగన్న, నివాసం : జమ్మిగూడెం, అశ్వారావుపేట మండలం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
.....వాది

మరియు

శ్రీమంతుల లక్ష్మకుమారి, భర్త : నారాయణరావు మరణించినందు వలన వారి వారసులు
1) శ్రీమంతుల నారాయణరావు, తండ్రి : నాగభూషణం, నివాసం : రవీంద్రనగర్, విశాఖపట్నం (డి5)
2) శ్రీమంతుల నగేష్‌బాబు, తండ్రి : నారాయణరావు, నివాసం : రవీంద్రనగర్, విశాఖపట్నం (డి6)
3) గ్రంధి లక్ష్మీసరస్వతి, భర్త : భాస్కరరావు, నివాసం : ఏలూరు (డి7)
.....ప్రతివాదులు

పై నెంబరులోని వాది మీపై ఆస్తి పంపకాల దావా వేసినందు వలన ప్రతివాదులైన మీ హాజరు నిమిత్తము **ది. 12.12.2025వ వాయిదా వున్నది. కావున మీరు ది.12.12.2025 మధ్యాహ్నం 03.00 గం.లకు** స్వయముగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని పై కోర్టు వారి యెదుట హాజరై ఇట్టి దావా విషయములో మీకు ఏమైనా అభ్యంతరములు వున్నచో తెలియజేయగలరు. ఆ విధముగా మ